www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 26 అక్టోబర్ 2023

5

ఏలూరు



27న కలిదిండిలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - ఏలూరు/కలిదిండి

ప్రతి బుధవారం, శుక్రవారం మండలస్థాయిలో జెకెసి గ్రీవెన్స్ డే నిర్వహణలో భాగంగా కలిదిండి మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 27న శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కలిదిండిలోని (భీమవరం రోడ్డు) కళ్యాణి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలిదిండి మండలంలోని ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.

బీమా ఉన్నట్టా.. లేనట్టా..!

వర్షాల్లేక వేలాది ఎకరాల్లో పంట నష్టం

చింతలపూడి, చాట్రాయి మండలాల్లో పరిస్థితి దారుణం

నీరు లేక ఎక్కడికక్కడే ఎండిపోయిన వరిపంట

బీమా ప్రీమియం చెల్లింపుపై వీడని గందరగోళం

పంటనష్టం అంచనాలు కదిలేదెప్పుడో

కన్నీరుమున్నీరవుతున్న అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఈ ఏడాది దెబ్బతిన్న పంటలకు బీమా వర్తిస్తుందా.. లేదా అనే అనుమానాలు అన్నదాతను వెంటాడుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతినంగా, పత్తి పంటసైతం దెబ్బతినే దశకు చేరుతోంది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి పంట నష్టపరిహారం, బీమా అందుతాయో, లేదో అనే భయం రైతులను పట్టిపీడిస్తోంది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత పంటల బీమా పథకం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే సాగింది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ప్రతియేటా బీమా సొమ్ము అందించడం జరుగుతోంది. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో ప్రభుత్వం బీమా నుంచి తప్పుకుని ప్రధానమంత్రి పసలబీమా పథకాన్ని మార్చి ప్రయివేటు కంపెనీలకు అప్పగించింది. రైతులకు సంబంధించిన బీమా ప్రీమియం ప్రభుత్వమే బీమా కంపెనీలకు చెల్లిస్తుందని చెప్పింది. ఇప్పటి వరకూ బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించిందా.. లేదా అనే ప్రశ్నకు సమాధానం ఏఒక్కరూ చెప్పడం లేదు. దీంతో దెబ్బతిన్న పంటలకు బీమా అందుతుందో.. లేదో అనే గందరగోళం అందరినీ వెంటాడుతోంది.

వర్షాల్లేక కమ్ముకున్న కరువు

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో పలు మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. ఏలూరు జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. చింతలపూడి, చాట్రాయి వంటి మండలాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోతున్న పరిస్థితి ఉంది. ఏజెన్సీలోనూ అదే పరిస్థితి ఉంది. చింతలపూడి మండలంలో 16 వేల ఎకరాల్లో వరిసాగవ్వగా దాదాపు పదివేల ఎకరాల్లో వర్షాధార పంటనే ఉంది. ఇప్పటి వరకూ అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం 1,098 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్లు తెలిసింది. దెబ్బతిన్న పంట దాదాపు ఐదు వేల ఎకరాలకు చేరవచ్చునని రైతులు చెబుతున్నారు. బోర్లలో నీటిమట్టం రెండు అడుగులు కిందకు పడిపోవడంతో పత్తిపంటకు సైతం ప్రమాదం ఏర్పడినట్లు రైతు ఆందోళన చెందుతున్నాడు. చాట్రాయి మండలంలోనూ వేలాది ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. దెబ్బతిన్న పంటలను పశువుల మేతకు రైతులు వదిలేస్తున్నారు. ముసునూరు వంటి మండలాల్లోనూ పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.20 వేలకుపైగా పెట్టుబడులు పెట్టిన పరిస్థితి ఉంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇక పశ్చిమగోదావరి జిల్లా డెల్టాలో సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి. శివారు ఆయకట్టుకు సాగునీరందక రైతులు తల్లడిల్లుతున్నారు. కాల్వల ఆధునికీకరణ చేపట్టకపోవడం, కనీసం తూడు తొలగింపు పనులు చేపట్టకపోవడం రీత్యా పరిస్థితి దారుణంగా తయారైందని రైతులు వాపోతున్నారు.



చింతలపూడిలో నీరు లేక ఎండిన వరిపైరు

ప్రభుత్వంలో చలనం కరువు

దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వం నుంచిగాని, అధికారుల నుంచిగాని చలనం లేకుండాపోయింది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి అంచనాల తయారీకి సైతం ఎటువంటి ఆదేశాలూ ఇప్పటి వరకూ వెలువడలేదు. మరోపక్క బీమాపై గందరగోళం నెలకొనడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి భరోసా ప్రకటన వెలువడలేదు. ప్రజాప్రతినిధులు సైతం నోరువిప్పడం లేదు. కరువు ప్రభావం మిగిలిన పంటలపైనా పడే పరిస్థితి కన్పిస్తోంది. ఇ-క్రాప్‌లో నమోదైన పేర్లు ఉన్న రైతులకు మాత్రమే బీమా వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇ-క్రాప్‌లో నమోదుకాని కౌలురైతుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

పంటనష్టం నమోదు ప్రక్రియ చేపట్టాలి


కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి నమోదు ప్రక్రియ వెంటనే చేపట్టాలి. వెంటనే పంట నష్టపరిహారం, బీమా పరిహారం అందించాలి. ముఖ్యంగా దెబ్బతిన్న పంటల జాబితాలో కౌలురైతుల పేర్లు నమోదు చేసి ఆదుకోవాలి.

ప్రాధాన్యతా భవనాల నిర్మాణంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించను

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరిక

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రాధాన్యతా భవనాల నిర్మాణాల లక్ష్య సాధనలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం రీసర్వే, స్వమిత్వా సర్వే, ప్రాధాన్యతా భవనాల నిర్మాణ ప్రగతి, నాడు-నేడు, గృహనిర్మాణం, గడపగడపకూ మన ప్రభుత్వం, వైద్య ఆరోగ్యం తదితర కార్యక్రమాల అమలును సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి సంబంధించి కొన్ని ప్రాంతాల్లో ప్రగతి తక్కువగా కన్పిస్తోందన్నారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరులోగా పూర్తయ్యేలా అధికారులు చూడాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. పంచాయతీ శాఖాధికారులు కార్యాలయాల్లో కూర్చొని, కిందిస్థాయి సిబ్బందిపై బాధ్యతను వదలకుండా క్షేత్రస్థాయి బాట పట్టాలన్నారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణంలో ప్రగతి కన్పించకపోతే ప్రభుత్వానికి సరెండర్ చేస్తానని, అందుకు సిద్ధంగా ఉండాలని పంచాయతీరాజ్ ఇఇలు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ రమాదేవిని కలెక్టర్ హెచ్చరించారు. పూర్తయిన భవనాలను వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వే పనులపై సమీక్షిస్తూ జిల్లాలో నిర్దేశించిన సమయంలోగా రీసర్వే పనులు పూర్తి చేయాలని, స్టోన్ ప్లాంటింగ్ కూడా చేయించాలన్నారు. రీసర్వేలో తహశీల్దార్ స్థాయిలో అనేక అప్పీళ్లు వస్తున్నాయని, దీనిని నివారించడానికి గ్రౌండ్ ట్రూతింగ్ అనంతరం గ్రామ సర్వేయర్, విఆర్ఒ స్థాయిలోనే పటిష్టంగా భూసర్వే పనులు చేపడితే అప్పీళ్లకు అవకాశం ఉండదన్నారు. స్వమిత్వా సర్వే పనులను కూడా నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్షిస్తూ ప్రస్తుతం నిర్మాణ పనులకు అనుకూలంగా ఉన్నందున ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఏర్పాటు చేసే సోక్‌పిట్స్ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో నమోదు చేయాలన్నారు. బుట్టాయగూడెం, నూజివీడుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు ప్రసవాలను ఆరోగ్యశ్రీ పథకంలో నమోదు చేయడం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సదరు అంశంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖాధికారిని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ సూర్యతేజ, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ట్రెయినీ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిపిఒ టి.శ్రీనివాస్ విశ్వనాథ్, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె. ఖాజావలి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజలకు సహకరించేలా పోలీసు శాఖ : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లతోపాటు ప్రజలకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉండేలా పోలీస్ శాఖను తీర్చిదిద్దుతున్నామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సబ్‌డివిజన్ల, సర్కిళ్లవారీగా కేసుల నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్టు, ఛార్జిషీట్ దాఖలు వంటి అంశాలపై అధికారులను ఆరా తీశారు. ఎస్‌పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో నేరాలకు పాల్పడే వారిపై నిఘా మరింత పెంచాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే సత్వరమే స్పందిస్తూ నిందితులపై చర్యలు చేపట్టాలని చెప్పారు. బాలికల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఆచూకీ తెలుసుకోవాలని తెలిపారు. జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాల రవాణా, విక్రయాలపై నిఘా పెంచాలన్నారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు జిల్లాలో బ్లాక్ స్పాట్లు గుర్తించి, ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సత్ప్రవర్తనతో మెలిగేలా వారిలో పరివర్తనకు కృషి చేయాలన్నారు. సివిల్ తగాదాల విషయంలో చట్టం మేరకు మాత్రమే పోలీసులు జోక్యం చేసుకోవాలని ఆదేశించారు. బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, పోలీస్ అధికారులు, సిబ్బంది అవినీతి, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు, ఎస్ఇబి అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు, డిఎస్‌పి రమేష్‌రెడ్డి, ఎస్‌బి సిఐ ఎంవిఎస్.మల్లేశ్వరరావు, ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు, డిటిసి డిఎస్‌పి కె.ప్రభాకరరావు, నూజివీడు డిఎస్‌పి అశోకకుమార్‌గౌడ్, ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌పి ఉమామహేశ్వరరావు, డిసిఆర్‌బి సిఐ దుర్గాప్రసాద్, జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రామకోటయ్య

ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు నియోజకవర్గం నుంచి 2024 సాధారణ ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయుచున్నట్లు మాజీ ఎంఎల్ఎ చెన్నం రామకోటయ్య ప్రకటించారు. మండలంలోని సుంకొల్లు కార్యాలయం వద్ద బుధవారం ఆత్మీయ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంఎల్ఎగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. మరింత అభివృద్ధిని సాధించేందుకు ఎన్నికలలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నానని ఆయన తెలిపారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం : ఎంఎల్ఎ దూలం

ప్రజాశక్తి - ముదినేపల్లి



వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రతీ పేదవానికి కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు తెలిపారు. మండలంలోని వణుదుర్రు గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్య బాధ్యతలను తన ఆరోగ్య బాధ్యతగా తీసుకుని, ఇంటి వద్దకే వైద్యులను పంపి సేవలు అందించటమే కాకుండా చికిత్స పొందేలా చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శవంతుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గ్రామ సర్పంచి చిన్నం సుగుణబాబు, ఎంపిటిసి గుమ్మడి వెంకటేశ్వరరావు, నాయకులు లేళ్ల ఆంజనేయులు, నున్న కనకరాజు, ఈడే పూర్ణచంద్ర రావు, దాసరి చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇ-క్రాప్ ముసాయిదా ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ఈనెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించబడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ 2023 సీజన్‌లో 4,83,899 ఎకరాల్లో పంటల సాగు, ఇ-క్రాప్ పూర్తి చేయుట జరిగిందన్నారు. గ్రామసభలు కూడా నిర్వహించబడతాయని తెలిపారు. ఈ గ్రామసభల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో ఉన్న రైతుల ఇ-క్రాప్ నమోదు అన్ని వివరాలను సమగ్రంగా చదివి వినిపించడం జరుగుతుందన్నారు. కావున రైతు సోదరులు రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీకి ప్రదర్శింపబడిన ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరములు ఏమైనా ఉన్నట్లయితే సవరణకు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ఉన్న విఎఎలను సంప్రదించి, అభ్యంతరములను రాతపూర్వకంగా తెలియజేయవలసిందిగా కోరుతున్నట్లు తెలిపారు. ఇ-క్రాప్ ఖరీఫ్ 2023 సీజన్ సవరణకు ఇది చివరి అవకాశం అన్నారు. తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు, చేర్పులు చేయబడవని ఆయన స్పష్టం చేశారు.

261 ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రస్తుత 2023-24 ఖరీఫ్ పంట కాలమునకు జిల్లాలో సుమారుగా 5 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యము దిగుబడి రావొచ్చునని జిల్లా యంత్రాగం అంచనా వేయుటం జరిగిందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. జిల్లాలో మొత్తం 261 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించి ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేశామన్నారు. రైతుల వద్ద నుంచి కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి) కల్పించి కొనుగోలు చేయుటకు గాను జిల్లాలో 133 కొనుగోలు సహాయక కేంద్రాలను(పిఎసిఎస్-84, డిసిఎంఎస్ 47, ఎఫ్‌పిఒ-2 సంఘాల ద్వారా) 261 రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానించడమైనదన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయుటకు గాను సిబ్బందిని జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా నియమించుట జరిగిందన్నారు. ఎక్కడైతే సిబ్బంది కొరత వచ్చినదో అక్కడ సంబంధిత కొనుగోలు సహాయక కేంద్రాల వారినే ధాన్యం సేకరణకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకొనవలసినదిగా కోరడమైనదన్నారు. రైతులకు, ఇతరులకు(ధాన్యం సేకరణ విషయంలో) అవగాహన, ప్రచారంకు సంభందించిన బ్యానర్లు, కరపత్రములు అన్నీ కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచడమైనదని తెలిపారు. కావున ఎక్కడైతే పంట కోతలు మొదలై ధాన్యం విక్రయించుటకు సిద్ధముగా ఉన్న కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియపరిచి ధాన్యం కొనుగోలు కేంద్రమును ప్రారంభించాలని జెసి తెలియజేశారు. రైతులు తాము పండించిన ధాన్యమును కోతలు అయిన వెంటనే సరైన పద్ధతి లో అరబెట్టుకొని రైతు భరోసా కేంద్రము వారిని సంప్రదించిన యెడల సంబంధిత వ్యవసాయ సహాయకుల వారిచే షెడ్యూలింగ్ చేయబడిన తరువాత, సదరు టెక్నికల్ సహాయకుడు ధాన్యము నమునాలను కల్లము నుంచి సేకరించి తేమ శాతం, ఇతర నాణ్యతా ప్రమాణాలు పరిశీలించిన పిమ్మట ప్రభుత్వం వారు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు అవగాహన కల్పించి నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న పూర్తి ధాన్యమును కనీస మద్దతు ధరకు సేకరించబడునని తెలిపారు.

12 గ్రామాల్లో 6,241 ఓపి నమోదు

ఏలూరు: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద బుధవారం 12 గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో సాయంత్రం ఆరు గంటల వరకు 6,241 ఓపి నమోదైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట తెలిపారు. వీరిలో మహిళలు 3,428 మంది, పురుషులు 2,813 మంది ఉన్నారన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం 113 మందికి మెరుగైన వైద్యం కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేసినట్లు తెలిపారు. వివిధ అనారోగ్య సమస్యలున్న 6,241 మందికి ఉచితంగా మందులు అందించామన్నారు. కంటి వెలుగు శిబిరంలో 900 ఓపి నమోదైందన్నారు.

జాడలేని వర్షాలు.. ఎండుతున్న పంటలు..!

ప్రజాశక్తి - చింతలపూడి

వర్షాకాలం వచ్చినా.. రైతుల కష్టాలు తీరడం లేదు. వేసవికాల పరిస్థితులతో మొలకెత్తిన విత్తనాలు సైతం ఎండకు ఎండిపోతున్నాయి. విపరీతమైన ఎండలతో రైతుల కష్టాలు వర్ణనాతీతం.. విత్తుకున్న విత్తనాలు మొలకెత్తించేందుకు.. మొలకెత్తిన విత్తనాలను కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సకాలంలో వర్షాలు రాక ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

గత మూడు నెలల నుంచి సరైన వర్షపాతం లేకపోవటంతో, ఎండలు మండిపోవటంతో చేతికి వచ్చిన వరిపంటతో రైతులు నష్టపోతున్నారు. రైతులకు ఒక పక్క చెరువులు ఎండిపోవటం, బోర్లలో నీటి ఎద్దడి తగ్గిపోవటంతో పత్తిపంటపై ప్రభావం చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 2 అంగుళాలు పోసే బోర్లు అంగుళున్నరకి, రెండు అడుగుల లోతుకి నీరు పడిపోయాయని రైతులు చెబుతున్నారు. గతంలో కంటే పెట్టుబడులు పెరిగాయని, ఎకరం పత్తిపంటకు దాదాపుగా లక్ష రూపాయలు పెట్టుబడులు అవుతున్నాయన్నారు. పత్తిపంటకు ఒకసారి నీరు పెడితే వారం పది రోజులుగా నీరు పెట్టే పని లేకుండా పోయేదని, ఇప్పుడు రెండు, మూడు రోజులకు నీరు పెట్టాల్సి వస్తుందని, దీనికి కారణం వేసవిని తలపిస్తున్న ఎండలేనని రైతులు వాపోతున్నారు.

ఆవేదనలో రైతులు

1,638 ఎకారాల్లో వరిపంట నష్టం..

చింతలపూడి, లింగపాలెం మండలల్లో వరిపంట 1,638 ఎకరాలు నష్టం వాటిల్లిందని, ఇంకా ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. చెరువులలో నీరు మోటర్లు పెట్టి పంటకు పెట్టుకోవడంతో చెరువులలో నీరు కూడా ఎండిపోయిన పరిస్థితులు నెలకొన్నాయి. బోర్లు కూడా రెండు అడుగుల కిందకు దింపాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్న పంటకు నీరు అందేనా?

వరిపంట, పత్తిపంటలు అయిన తరువాత వేసే మొక్కజొన్న పంటకు నీరు అందేలా లేదని, ఈ సంవత్సరం మొక్కజొన్న వేసే పరిస్థితి ఉండకపోవచ్చని రైతులు చెబుతున్నారు. వర్షం పడితేనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని రైతులు చెబుతున్నారు.

పత్తి పంటకు మార్కెట్‌లో మంచి గిరాకి..

చింతలపూడిలో 20 ఎకరాలు, లింగపాలెంలో 540 ఎకరాల్లో పత్తి పంట సాగుచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి పంటకు మంచి గిరాకీ ఉంది. టన్ను రూ.55 వేలు వరకు ఉందని, గత సంవత్సరం రూ.40 వేలు ఉండగా ఈ సంవత్సరం రూ.15 వేలు వరకు రేటు అదనంగా ఉందని సంతోషించే సమయంలో వర్షాలు లేకపోవటం, బోర్లు అడుగులు దిగిపోవటంతో రైతులకు మింగుడు పడటం లేదు.



నీరు లేక ఎండిపోయిన చెరువులు



చేతికొచ్చిన పత్తిపంట

వివరాలు సేకరిస్తున్నాం

ఎఒ మీనా కూమరి

వరిపంట నష్టం వివరాలు సేకరిస్తున్నాం, పై అధికారులకు నివేదిక అందజేస్తాం. అదే విధంగా బోర్లు నీటి శాతం తగ్గిందని రైతులు చెబుతున్నారు. పత్తిపంటకు ఇప్పటి వరకు పర్వాలేదు, ఎండలు ఇదే విధంగా కొనసాగితే పత్తి పంటలకు కూడా ఇబ్బందే.

ప్రభుత్వమే ఆదుకోవాలి

అది వేణు, శెట్టివారిగూడెం

వర్షాలు పడకపోవటంతో, ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. దీని ప్రభావం బోర్లుపై కూడా పడింది. వరి, పత్తి పంట రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

కోడిగుడ్డు మంచి పోషకాహారం

ఐటిడిఎ పిఒ సూర్యతేజ

బుట్టాయగూడెం: కోడిగుడ్డు మంచి పోషకాహారమని, కోడిగుడ్డు తింటే జ్వరం వస్తుందనే అపోహను ప్రజలు వీడాలని ఐటిడిఎ పిఒ సూర్యతేజ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న కోడిగుడ్డును జ్వరం వస్తుందనే అపోహతో కొందరు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారని, ఇది సరికాదని పేర్కొన్నారు. ప్రజల్లో ఉన్న పోషకాహార లోపాన్ని పోగొట్టడంలో కోడిగుడ్డు ఆహారంలో భాగం చేసుకోవడం అతి ముఖ్యమని తెలిపారు. కోడిగుడ్డు తింటే జ్వరం వస్తుందనే అపోహ నుండి ప్రజలు బయటకు రావాలని, అందరూ తప్పనిసరిగా మధ్యాహ్నపు భోజనంలో, అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న కోడిగుడ్లను తీసుకుని పిల్లలు, మహిళలు పోషకాహారలోపం నుండి బయటపడాలని సూర్యతేజ విజ్ఞప్తి చేశారు.

ఆర్‌టిసి బస్సులో మందుబాబు వీరంగం

మహిళా ప్రయాణికులపై దాడి - సుమారు గంటసేపు నిలిచిన బస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ వద్ద నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సు

ఆర్‌టిసి బస్సులో ఓ మందుబాబు వీరంగం సృష్టించి మహిళా ప్రయాణికులపై దాడికి పాల్పడటంతో డ్రైవర్, కండక్టర్లు ఆ వ్యక్తిని పోలీస్ స్టేషన్లో అప్పగించారు. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి బస్టాండ్ నుండి నరసాపురం బయలుదేరిన బస్సులో మద్యం సేవించిన ఓ వ్యక్తి నరసాపురానికి టిక్కెట్ తీసుకున్నాడు. ఈ క్రమంలో తోటి మహిళా ప్రయాణికులతో గొడవపడ్డాడు. అంతటితో ఆగకుండా మహిళా ప్రయాణికులపై చేయి చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆ బస్సు డ్రైవర్, కండక్టర్ బస్సును నేరుగా జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ మద్యం మత్తులో ఉన్న ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. అలాగే దాడికి గురైన ఇద్దరు మహిళా ప్రయాణికులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. అయితే సుమారు గంటకుపైగా పోలీస్ స్టేషన్ వద్ద ఆర్‌టిసి బస్సు నిలిచిపోవడంతో తోటి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తర్వాత బస్సు బయల్దేరింది. మద్యం మత్తులో దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని ప్రయాణికులను పంపకుండా గంటకుపైగా వేచి ఉండేలా చేయడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై స్థానిక ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని వివరణ అడగ్గా తమకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదని తెలిపారు.

ఎంపిపిగా కోటగిరి రాజానాయన

ప్రజాశక్తి - ముసునూరు



నూతన తాత్కాలిక ఎంపిపిగా కోటగిరి రాజానాయన బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుత ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి వయస్సు రీత్యా వృద్ధాప్యం, పలు అనారోగ్య కారణాలతో మండల ఎంపిపి పదవికి రాజీనామా చేసినట్లు ఆమె తెలిపారు. మరలా ఎంపిపి ఎన్నిక జరిగే వరకు రాజానాయన ఎంపిపిగా కొనసాగుతారన్నారు. త్వరలో ఎంపిపి అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించినున్నట్లు తెలియజేశారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - మండవల్లి

ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్ట్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సిడిపిఒ ఆనంద్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన మండవల్లి అంగన్‌వాడీ వన్ సెంటర్ నందు ఆయా పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే దరఖాస్తురాలు స్థానికురాలై ఉండడంతో పాటు, వివాహితురాలై 2003 సంవత్సరానికి 21 సంవత్సరం నిండి ఉండాలని తెలిపారు. అంతే కాకుండా తప్పనిసరిగా పదవ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందిస్తున్నామని, దరఖాస్తురాలు విద్యార్హత ధ్రువ పత్రము, బదిలీ సర్టిఫికెట్‌తో పాటు కుల, నివాస ధ్రువపత్రాలకు ఆధార్ కార్డు జత చేసి, రెండు కలర్ ఫోటోలతో రెండు సెట్లకు జత చేసి కార్యాలయంలో అందించాలని తెలియజేశారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు స్వీకరించబడవని ఆయన స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఉంగుటూరు : మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారని భీమడోలు ఐసిడిఎస్ సిడిపిఒ పేర్కొన్నారు. మండలంలోని ఉంగుటూరు, సీతారాంపురం, కైకరం, తిమ్మాయపాలెం, వెంకట కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు ఖాళీలను భర్తీ చేసేందుకు అదే గ్రామానికి చెందిన మహిళ అభ్యర్థులు నవంబరు ఒకటవ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. సంబంధిత నోటిఫికేషన్ ఆయా పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు.



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ముద్దరబోయిన

పలువురికి ముద్దరబోయిన పరామర్శ


ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఈలప్రోలు శ్రీనివాసరావు సోదరుడు ఈలప్రోలు తాతబ్బాయి ఇటీవల మరణించడంతో నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఈదులగూడెంలోని శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి పరామర్శించి, ప్రగాఢసానుభూతిని తెలియపర్చారు. తోటపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు బెజవాడ శివరాం ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను ముద్దరబోయిన పరామర్శించారు. ఇటీవల మరణించిన తోటపల్లి గ్రామానికి చెందిన బెజవాడ రామారావు కుటుంబాన్ని ఆయన పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలియపర్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్నేని శివరామకృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు, ముల్లంగి శేఖర్‌బాబులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఎల్లప్పుడూ అనుకూలంగా ఉండి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన ముసునూరు మండల పరిషత్ కార్యాలయం నందు మండలంలోని 16 గ్రామాల సచివాలయ సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్నకు చెబుతాం లాంటి కార్యక్రమాల్లో సచివాలయ సిబ్బంది ముందంజలో ఉండి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నవరత్నాల పేరిట ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాలని సూచిస్తుంటే సచివాలయ సిబ్బంది అలసత్వం వహించరాదన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చిన్నా

ఘనంగా బత్తిన పుట్టినరోజు వేడుకలు

వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ

జంగారెడ్డి గూడెం : స్థానిక వైసిపి నాయకులు బత్తిన చిన్న జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బుట్టాయిగూడెం రోడ్లో ఉన్న చంద్రశేఖర కళ్యాణ మండపం వద్ద చిన్న జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. చంద్రపురి ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మితో పాటు పాలకవర్గ సభ్యులు చిన్నాకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్న జన్మదిన వేడుకలు పురస్కరించుకొని పలువురు రక్తదానం చేశారు. అలాగే మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు ఇంటి వద్ద వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మానవతా మూర్తి, కంచర్ల విష్ణు, నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గా ప్రసాద్, సంకు సురేష్, చిప్పాడ వెంకన్న, పాల్గొన్నారు.

మద్ది ఆలయంలో అన్నదానం

జంగారెడ్డిగూడెం : మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. బుధవారం ఆలయానికి యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చారన్నారు. ఈ క్రమంలో యాత్రికులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశామని, ఆలయ సిబ్బంది సేవలందించారని తెలిపారు.

పలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలోని పలు పోస్టులు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై ఒక సంవత్సరం కాల పరిమితితో నియమించుటకు దరఖాస్తులు కోరుతున్నట్లు వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఉమ్మడి పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లా వెబ్‌సైట్స్ https://eluru.ap.gov.in, https://westgodavari.ap.gov.in సందర్శించవలెనన్నారు.

ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే.. ఆరోగ్య సురక్ష లక్ష్యం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - కైకలూరు

ప్రజలందరూ పూర్తి ఆరోగ్యంగా ఉండటమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలు గుర్తించి పరిష్కరించి, 14 రకాల వైద్య పరీక్షలతో పాటు, 172 రకాల మందులను అందుబాటులోకి తీసుకువచ్చి ఉచితంగా అందిస్తున్న ఘనత ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వేమవరప్పాడు గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామ సచివాలయం నందు జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అన్నిరకాలుగా సేవలు అందిస్తున్న జగన్‌ను మరలా అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్, జెడ్‌పిటిసి కురేళ్ల బేబీ, మండల పార్టీ అధ్యక్షులు భట్రాజు శివాజీ, సర్పంచి నున్న రాంబాబు, ఉప సర్పంచి జాజుల రాజు, పిఎసిఎస్ అధ్యక్షులు బోడావుల శ్రీనివాసరావు, ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : నారాయణపురం సచివాలయం-1 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దారు బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు సేవలందించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఔషధాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.ప్రేమాన్విత, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, పంచాయతీ సభ్యులు అడపా శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యుడు, మండల ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, వైసిపి నాయకుడు బళ్ల త్రిమూర్తులు, వార్డు సభ్యులు, సచివాలయం కన్వీనర్లు సీపాని బాలు, మతుకుమిల్లి శ్రీధర్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



నారాయణపురంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ సద్వినియోగం చేసుకోవాలి


ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని రాజవరం పంచాయతీ పరిధిలో వైఎస్ఆర్ పౌష్టికాహార అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పొంగుటూరు సెక్టార్ పరిధి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని తహశీల్దార్ నాగమణి ప్రారంభించి, పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలిపారు. ముఖ్యంగా బాలింతలు, గర్భిణులు రక్తహీనతకు లోను కాకుండా ఉండేందుకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ దోహదపడుతుందన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ఖర్చులు తగ్గించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి విద్యాసాగర్ తెలిపారు. బుధవారం నూజివీడులో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా సాగుకు సూచనలు చేస్తున్నామన్నారు. ఇ-క్రాఫ్ నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. రైతు పర్వతనేని వెంకట దుర్గా చంద్రశేఖర్ మాట్లాడుతూ అధికారుల సూచనలతో లాభాలు పొందుతున్నట్లు వివరించారు.



చిన్నారితో రెడ్‌క్రాస్ సిబ్బంది, వైద్యులు

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రంలో బుధవారం 11 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా చిన్నారులకు రక్తమార్పిడితో పాటు వారికి కావాల్సిన మందులను కూడా తెప్పించి, అందుబాటులో ఉంచుతున్నామన్నారు. తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారులు వ్యాధి నిర్ధారిత పత్రాలతో రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో నమోదు చేయించుకుని, ప్రభుత్వం నెల నెల అందించే రూ.10 వేలకు అర్జీ పెట్టుకోవాలని తెలిపారు. బుధవారం తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 30 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత మానవత సభ్యులు మాడ సీతారత్నంకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, మానవత సభ్యులు మేతర రాజబాబు, రత్నాకరరావు, మానేపల్లి రామారావు, రెడ్‌క్రాస్ సిబ్బంది, వైద్యులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అండగా ఉంటాం : ఎపి జెఎసి



ఎన్నికైన కార్యవర్గంతో రాష్ట్ర నాయకత్వం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి జెఎసి అమరావతి ఎల్లప్పుడు మహిళా ఉద్యోగులకు అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని ఎపి జెఎసి అమరావతి జిల్లా యూనిట్ ఛైర్మన్ రమేష్ కుమార్ తెలిపారు. ఎపి జెఎసి అమరావతి జిల్లా మహిళా విభాగం కార్యవర్గాన్ని స్థానిక రెవెన్యూ భవనంలో బుధవారం ఎపి జెఎసి అమరావతి జిల్లా యూనిట్ ఛైర్మన్ రమేష్ కుమార్, జనరల్ సెక్రటరీ రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో రమేష్ కుమార్, ముఖ్య అతిథిగా హాజరైన అసోసియేషన్ రాష్ట్ర నాయకులు టివి.ఫణి పేర్రాజు మాట్లాడుతూ బొప్పరాజు సంకల్పం, మహిళా విభాగం ఆవశ్యత గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర సెక్రెటరీ జ్యోతి ఎన్నికైన జిల్లా మహిళా విభాగం కార్యవర్గాన్ని ఆహ్వానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఛైర్‌పర్సన్‌గా ఆర్‌విబిటి.సుందరి, అసోసియేట్ ఛైర్‌పర్సన్ జి.శాంత కుమారి, కో ఛైర్‌పర్సన్‌లుగా డా.ఫజియ ఖతోన్, యు.యామిని, విమల, గౌరీ దేవి, జనరల్ సెక్రటరీగా బి.గీతిక, కార్యదర్శులుగా ఎన్.దివ్యశ్రీ, పి.జాన్సీ లక్ష్మీబాయి, జి.నాగేశ్వరమ్మ, పివి.ఆదిలక్ష్మి, కోశాధికారిగా ఎస్‌కె.బషీన్ ఎంపికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ పి.లక్ష్మి, జనరల్ సెక్రటరీ విజయలక్ష్మి, కో ఛైర్ పర్సన్ సాయిలక్ష్మి, సెక్రటరీ కోటేశ్వరీ దండలతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. అనంతరం స్టేట్ జనరల్ సెక్రటరీ విజయలక్ష్మి ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆక్వా రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి


ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించి, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు పవర్ పేటలోని అన్నే భవనంలో ఆక్వా రైతుల సమస్యలపై ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రైతుకు ఫీడ్ ధరలు తగ్గించడం, రొయ్యలు, చేపలకు ధరలు పెంచడం, విద్యుత్ సబ్సిడీని పునరుద్ధరించడం వంటి చర్యలను వెంటనే చేపట్టి ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే ఆక్వా రైతులు నష్టపోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీడ్ తయారీలో వాడే ముడి సరుకుల ధరలకు అనుగుణంగా ఫీడ్ ధరలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అంతర్జాతీయంగా రొయ్యల ధరలకు అనుగుణంగా రైతులకు ధరలు ఇప్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన యంత్రాలతో ఆక్వా ఫీడ్ మిల్లులను ఏర్పాటు చేయాలన్నారు. రైతులు పండించే రొయ్యలు విదేశాలకు ఎగుమతి చేయడంతో పాటు ప్రతి మున్సిపాలిటీ పరిధిలో అమ్మకం కేంద్రాలు తెరవాలన్నారు. ఫీడ్ కంపెనీలు, కెమికల్ కంపెనీలు వారి డీలర్లకు ఇచ్చే ధరకు, రైతులకు అమ్మే ధరకు ఎంఆర్‌పిలో చాలా వ్యత్యాసం ఉంటున్నదని, దీన్ని తగ్గించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా నిర్ణయించిన ధరలలో కోత పెట్టి ధరలు తగ్గించడం తగదన్నారు. 100 కౌంట్ రొయ్యలకు రూ.240 ధర అమలు చేయాలని తెలిపారు. చేపలకు మద్దతు ధరలు ప్రకటించి అమలు చేయాలన్నారు. ఆక్వా రైతుల ఆందోళనలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతులను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి



బీమా చెక్కును నామినీకి అందజేస్తున్న మేనేజర్ దుర్గారావు

ఆపద సమయంలో ఆసరాకు వచ్చే బీమాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఇండియన్ మేనేజర్ బొంతు దుర్గారావు స్పష్టం చేశారు. రుద్రవరం గ్రామానికి చెందిన పటాన్ మునిషా బీమాలో చేరి మృతి చెందడంతో బీమా ద్వారా వచ్చిన రూ.2 లక్షల చెక్కును నామినీకి అందించేందుకు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రోజుకి రూ.1.25 పైసలు కడితే చాలు రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఏడాదికి రూ.436 చెల్లించి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమాలో చేరిన వ్యక్తి ఏదైనా ప్రమాదంలో మరణిస్తే అతని కుటుంబానికి రెండు లక్షల రూపాయల బీమా వర్తిస్తుందని తెలిపారు. 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు వారు సంవత్సరానికి రూ.20 చెల్లించి పిఎం సురక్ష బీమా యోజన పథకంలో చేరిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే నామినీకి రూ.2 లక్షలు, చేతులు, కాళ్లు, కళ్ళు పోగొట్టుకుని శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.2 లక్షలు, ఒక అవయవం పోతే రూ.లక్ష చొప్పున బీమా వర్తిస్తుందన్నారు. వృద్ధాప్యంలో ఆర్థికంగా సాయం అందించడానికి తీసుకువచ్చిన అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరి 60 ఏళ్లు పైబడిన వారికి ప్రతినెల పెన్షన్ రూ.1,000 నుంచి రూ.5 వేల వరకు అందుతుందని తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు వారు ఈ పథకాలలో చేరి లబ్ధి పొందవచ్చునని, సామాజిక భద్రత పథకాలైన ఈ మూడు పథకాలపై ప్రజల అవగాహన పెంపొందించుకుని బీమాలో చేరాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, బ్యాంకు మిత్ర సిహెచ్.వెంకట కళ్యాణి, బి.కిరణ్, దేవిద్రాజు, నిఖిత, ప్రేమకుమారి, కె.సురేష్, సుజాత, మమతా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు ఉచితంగా ఇవ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - చింతలపూడి

వ్యవసాయ కూలీలు, పేదల కుటుంబాలకు నెలకు రూ.10వేలు కరువు పెన్షన్‌తో పాటు నెలనెలా 35 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఇస్తరాకుల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు రాష్ట్ర పిలుపులో భాగంగా బుధవారం మండలంలోని మల్లాయగూడెం, రేచర్ల గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సచివాలయాల్లో వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనావృష్టి కారణంగా ఈ సంవత్సరం తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ముఖ్యంగా రాయలసీమతో పాటు ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యంత దారుణంగా కరువు ఛాయలు ఏర్పడ్డాయని, కరువు నుంచి పేదలను, వ్యవసాయ కూలీలను, రైతులను విముక్తి చేసి వలసలు ఆపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ప్రధానంగా వ్యవసాయ పనులు లేక గ్రామాలు గ్రామాలే ఖాళీ అవుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు, వ్యవసాయ కూలీలకు, రైతులకు ఉపాధి చూపి ఆకలి తీర్చవలసిన అవసరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు పరిస్థితులు నివారించడానికి మీనా వేషాలు లెక్కబెడుతున్నాయని తెలిపారు. తక్షణమే కరువు పరిస్థితులను అంచనా వేసి, కరువు మండలాలు ప్రకటించాలని రాష్ట్ర పిలుపులో భాగంగా 25 నుంచి 29వ తేదీ వరకు అన్ని సచివాలయాల్లో వినతులు ఇచ్చి, ఆందోళనలకు పిలుపు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని 200 రోజులకు పెంచాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేచర్ల సచివాలయంలో వినతిని ఇచ్చిన వారిలో పోలా దాసు చెంచయ్య, మల్లాయగూడెం సచివాలయంలో ఎస్‌కె.జానీ, తక్కిలపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేపు చేతి వృత్తిదారుల జిల్లా విస్తృత సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల జిల్లా విస్తృత సమావేశం అక్టోబర్ 27వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఏలూరు రామచంద్రరావు పేటలోని చేతి వృత్తిదారుల జిల్లా కార్యాలయంలో జరుగుతుందని సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ ఆగొల్ల వెంకటకృష్ణారావులు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక ఆర్ఆర్ పేట లోని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదిశేషు మాట్లాడుతూ చేతి వృత్తిదారుల రక్షణకు, సామాజిక భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్ణయించిందన్నారు. నవంబర్ 10వ తేదీ నుంచి 28వ తేదీ వరకు చేతి వృత్తిదారులతో సమావేశాలు నిర్వహించి, 30వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద చేతివృత్తి దారులతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తి దారులందరూ పాల్గొని, జయప్రదం చేయాలని వారు కోరారు.

వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఎఐటియుసి అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను బుధవారం ఏలూరులో ఆర్ఆర్ పేట ఎస్ఆర్‌టు వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.శ్రీనివాస్, డి.వెంకటేశ్వరరావు, ఎన్.శ్రీను, సిహెచ్.అప్పారావు, కె.ఏలియా, గేదెల రవి, కె.రామారావు, జి.ప్రసాద్, డి.అప్పారావు, ఎస్.వెంకన్న ప్రసాద్ పాల్గొన్నారు.



నాగేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న టిడిపి సభ్యులు

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆపదలో ఉన్న టిడిపి కుటుంబ సభ్యులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని టిడిపి మండల కమిటీ అధ్యక్షులు సాయిల సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని మైసన్నగూడెంలో ఇటీవల మృతి చెందిన నూనే నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను టిడిపి మండల కమిటీ సభ్యులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాంబాబు, ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, కొట్టూరు ప్రసాద్, మండల రైతు అధ్యక్షుడు ఏలికే ప్రసాద్, గ్రామ కార్యదర్శి మోటమర్రి ధర్మరాజు పాల్గొన్నారు.